డిసెంబర్ 11న రాత్రి ఎనిమిదిన్నర ముహూర్తం. పెళ్లి వైభవంగా జరిగింది. పెళ్లికూతురుగా స్వప్న ఎంతో ముద్దొస్తోంది. ఎర్రంచు తెల్లచీరలో కాళ్లకు పారాణి, మెడలో పచ్చగా మెరుస్తూ నుదుటిన కళ్యాణతిలకం, పూలజడ ఇవన్నీ చూస్తుంటే ఎవరికి మూడ్ రాదు. అందులోనూ మార్గశిర మాసపు చలి, పెళ్ళికాని వారే జంట కట్టి భాగస్వామి వెచ్చటి కౌగిలిలో చలిని పోగొట్టుకోవాలని ప్రయత్నిస్తుంటే చక్కగా పెళ్ళి చేసుకున్న మాకు మాత్రం ఆ తర్వాతి కార్యక్రమం అడ్డుపడింది.

ఆ పూజారి మాత్రం ఎంత కర్కోటకుడు కాకపోతే ఇంత నిరంకుశ, నిర్దాక్షిణ్యంగా నిర్ణయం తీసుకున్నాడు.

'కృత్తికా నక్షత్రం వారికి ఈ మాసంలో 'ఆ'శుభ కార్యం జరపడానికి మంచిరోజులు లేవంటూ. మరి పెళ్ళికి మాత్రం ఉన్నాయా? దేవుడు వరమిచ్చినా పూజారి ఇవ్వకపోవడం అంటే ఇదే కాబోలు'. ఎదురుగా అప్సరసలా, అభిసారికలా నా స్వప్న. ఏమీ చేయలేని అశక్తత. పోనీ కనీసం ఒక ముద్దుపెడతామన్నా ఆమెకి వాళ్ళమ్మ సెక్యూరిటీ, నాకు నాగదిలో మా పితృదేవులు. అసలీ పెద్దవాళ్ళకి మనస్సు ఉండదా? వాళ్లకీ బాధలు అర్థం కావా? మా ఇద్దర్నీ శత్రుదేశాలైన ఇండియా పాకిస్తాన్ లాగా వేరుచేసి, మధ్యలో కంచెగా మారి మా దుంప తెంపుతుంటే తట్టుకునేశక్తి లేక, తెగించి విరహించి సైగ చేస్తిని కదా?

"ఏంటి బావగారూ! పిలిచారు" అంటూ బయల్దేరింది పదమూడేళ్ళ మరదలు పిల్ల.

అసలిదొక పెద్ద హర్డిల్ అయిపోయింది. పెళ్లిలో కూడా కనీసం తాళికట్టేటప్పుడు, పాణిగ్రహణం అప్పుడు తప్ప తనని తాకనీయకుండా అడ్డుపడ్డ పెద్దగోడ ఇది. మరదలు కాదు మట్టిగడ్డ, దీని పెళ్ళిలో ఈ కక్ష తీర్చుకోవాలి అనుకుంటుంటే

"బావగారూ! ఏంటి ఆలోచిస్తున్నారు. చెప్పండీ ఏంకావాలి" అంటుంటే "మంచినీళ్ళు" అంటూ నీళ్ళు నమిలాను.

ఇలా వీళ్ళ మధ్యన ఇరవై నాలుగ్గంటలు గడిచే సరికి, నా వళ్లంతా వేడెక్కి శరీరం సెగలు పొగలవుతుంటే తట్టుకోలేక చివరికి నా భార్యని నేనే రేప్ చేసే పరిస్థితి వస్తుందేమోనని భయం వేసి లీవ్ క్యాన్సిల్ చేసుకుని డ్యూటీలో జాయిన్ అయితే పనిలో పడి ఈ బాధ మర్చిపోగలనేమో అని బెంగుళూరు బయల్దేరాను.

"అల్లుడిగారికి కోపం వచ్చినట్లుంది, పదిరోజుల లీవ్ కూడా క్యాన్సిల్ చేసుకుని వెళ్ళిపోతున్నారు" అంటూ మామగారి సన్నాయినొక్కులు చూస్తుంటే ఒళ్ళు మండిపోయింది.

ఎదురుగా పంచభక్ష్య పరమాన్నాలు పెట్టి, ఉపవాసం ఉంచినట్లుగా, ఎదురుగా మహా నైవేద్యం పెట్టి కనీసం ప్రసాదం కూడా ఇవ్వకుండా ఏడ్పిస్తుంటే ఎవరితో చెప్పుకోవాలి.

మండే ఆఫీసులో కనబడగానే అందరూ ఏ దెయ్యాన్నో చూసినట్లు హడలిపోయారు. కంగ్రాట్యులేషన్స్ లేవు సరికదా? "ఏనీథింగ్ రాంగ్" అంటూ వెధవ ప్రశ్నలు. టీ బ్రేక్‌లో కాఫీ కప్పు యాష్‌ట్రే అనుకుని పరధ్యానంగా యాష్ అందులో తట్టి మళ్ళీ అదే తాగెయ్యగానే మొదలయ్యింది అసలు కథ. అసలే వీళ్ళందరూ ఈ విషయంలో ముదుర్లు. పట్టేశారు నా సంగతి. అసలు విషయం చెప్పక తప్పింది కాదు.

"వ్వాట్ యార్! ఈరోజుల్లో కూడా ముహూర్తాలు అవీ. పెళ్ళికి అంటావా. ఇట్స్ ఓకే. బట్ ఇలా ప్రతీదానికి అంటే కష్టం. ఇంకా ఇలాంటి ఛాందసుల మధ్యన ఎలా బ్రతుకుతున్నావు. దట్ టూ ఒకటి రెండు రోజులు కాదు రెండునెలలు. మళ్ళీ మాఘమాసంలోనే ఆ శుభకార్యం" అని ఖరాఖండీగా తేల్చేశారు.

ఇంక ఈ రెండునెలలు నేనీ ధ్యాసలో ఉంటే తీరా శోభనం టైంకి ఈ ఉద్యోగం ఊడిపోవచ్చునని నిర్ణయించాం. ఇంక పరిష్కారం ఎలాగా అన్నదే సమస్య. అసలే స్వప్న పరమ ఛాదస్తం. వాళ్ళమ్మ లేనప్పుడు ఒక్క కిస్ ఇమ్మంటేనే పెద్ద కటింగ్ ఇచ్చింది.

ఇంక శోభనం అంటే అదీ పెద్దలకి తెలియకుండా జరిగే పనికాదు. ఆలోచనలతో అన్యమనస్కంగా రోజంతా గడిచిపోయింది. సాయంత్రం సెల్ రింగ్ అయితే అది స్వప్న. 'అమ్మో ఈ అందాలరాక్షసికి కాస్త మెదడు కూడా ఇచ్చాడు దేవుడు' అని ఆనందంగా ఫోన్ లిఫ్ట్ చేసి తను చెప్పిన వార్తకి ఎగిరిగంతేశాను ఆఫీసు అని మర్చిపోయి.

నిజం కంటే ఊహ అందంగా ఉంటుంది అనే విషయం నా విషయంలో అక్షరాలా నిజం. వారమంతా ఊహల్లో తేలిపోయి ఎంతో ఎఫిషియెంట్‌గా వర్క్ చేయగలిగాను.

'శుక్రవారం రాత్రికి నా హైదరాబాద్ ప్రయాణం. అక్కడ స్వప్న ఇంట్లో నేను స్వప్న. ఇద్దరమే హద్దు, అదుపు, పెద్దలు, గోల ఏమీలేదు. ఆకాశపుటంచులను అందుకునే అవకాశం' అనుకుంటూ బయల్దేరాను.

రాత్రంతా బస్సులో ఏవో ఆలోచనలు. స్వప్న అణువణువునీ నేను ఆక్రమించుకున్న ఆలోచనలే. చలిగాలి, వేగంగా వెళ్తున్న బస్సు భలే రొమాంటిక్‌గా ఉంది. స్వప్న అమ్మమ్మ మా ఇద్దరికీ ఈ మంచి అవకాశం కల్పించడానికే కాబోలు ఒక సంవత్సరం క్రితం కాలం చేసింది. ఆమె సంవత్సరీకాలకే ఇల్లంతా కదిలివెళ్ళారు.

స్వప్న మాత్రం తనకి మంత్లీ ప్రాబ్లమ్ అని అబద్ధం చెప్పి తన కోసం ప్రయాణం ఆపుకుంది. అదే విషయం మండే సాయంత్రం ఫోన్‌లో చెప్పింది. ముందుగా ఇంతమంచి అవకాశం కల్పించిన ఆ అందాల భార్యని వాటేసుకుని గట్టిగా ముద్దుపెట్టుకోవాలి. తర్వాత ఒకదాని తర్వాత ఒకటి ఆటోమేటిగ్గా జరిగిపోతాయి అనుకుంటూ గుమ్మంలో ఆటోదిగాను. ఎదురుగా నా కోసం ఎదురుచూస్తూ, నా అందాల కలల రాకుమారి పక్కనే తోకలగా వాళ్ళక్క కూతురు ఐదేళ్ళ చిన్నీ. 'మధ్యలో పానకంలో పుడకలా ఇదేంటిరాబాబూ' అనుకుంటూంటే "బాబాయ్ బాగున్నారా? నాకు ఎగ్జామ్స్. అందుకే పిన్నితో ఉండిపోయాను" అంది.

'ఓసినీ నువ్వు చదివే బోడి యూకెజికి పరీక్షలు. చివరికి నేను నీకు కూడా చులకన అయిపోయాను' అనుకుంటూ పళ్లు నూరుతూ లోపలికి నడిచాను.

"ప్రయాణం బాగా జరిగిందా? ముఖం కడుక్కోండి. కాఫీ తెస్తాను'' అంటూ వంటగదిలోకి నడిచింది స్వప్న.

కొండచిలువలా బారెడు జడ, ఆ పిరుదుల్ని తాకుతూ నడుస్తుంటే నాకే అసూయ పుట్టింది.

కనీసం ఆ జడ మాత్రం కాలేదా నా జీవితం అని. స్వప్న చేతి కాఫీ, ఆమెతో మాట్లాడుతుంటే ప్రతీది అద్భుతంగా అన్పిస్తోంది. పెళ్ళి అనేది ఎంత బలమైన బంధమో, ఇద్దరు మనుష్యుల్ని ఏంత గట్టిగా ముడివేస్తుందో, ఆ బంధానికి ఎంత మంచి నిర్వచనం చెప్పారు పెద్దలు అని ఆశ్చర్యం వేసింది. ఇంక తొమ్మిది అయితే చిన్నీ ఆటో వస్తుంది అది యూనిట్ టెస్ట్ రాయడానికి స్కూల్‌కి వెళ్తుందని ఆశపడుతూంటే, ఆటోవాడు వచ్చి ఏదో పొలిటికల్ మీటింగ్ ఉండడంతో స్కూళ్ళన్నీ బంద్ చేశారు పరీక్ష సోమవారానికి వాయిదా పడిందని చావు కబురు చల్లగా చెప్పి పోయాడు.

హతోస్మి ఈ పిల్లని రేపటివరకూ సంబాళించి, తన కార్యక్రమంలో ఎలా ప్రొసీడ్ అవ్వాలో అర్థంకాలేదు. బిజినెస్ ఆడమని, కారం బోర్డ్ ఆడమని, చాక్లెట్స్ కావాలనీ ఇలా రకరకాలుగా హింసిస్తున్నా స్వప్న ముఖం చూసి దాన్ని క్షమించేస్తున్నా.

అయినా నా మెతకదనం వల్ల అది మరింత అల్లరి చేస్తోంది.

"పిన్నీ! పిన్నీ'' అంటూ స్వప్నని ఒక్క నిముషం వదలడంలేదు. రాత్రివరకూ టీవీ వల్ల టైం గడిచింది.

మంచి భోజనం. స్వప్న చేతివంట అమృతంలా ఉంది. తనకి, చిన్నీకి కింద, నాకు అదే గదిలో మంచం మీద పక్క ఏర్పాటుచేసింది. నా గుండె సవ్వడి నాకే స్పష్టంగా విన్పిస్తోంది. గొంతు తడారిపోతున్న ఫీలింగ్. స్వప్న చీర కొద్దిగా తొలగి ఉచ్ఛ్వాసనిశ్వాసలు స్పష్టంగా తెలుస్తున్నాయి. పక్కనే ఉన్న చిన్నీ గాఢనిద్రలో ఉంది.

డైటింగ్ చేస్తా

'ఇండస్ట్రీలోకొచ్చినప్పటికీ ఇప్పటికీ నా రూపంలో చాలా మార్పు వచ్చింది. నిజమే. అప్పుడు నేను చాలా సన్నగా ఉండేదాన్ని. షూటింగ్స్‌లో బిజీగా ఉంటూ దొరికింది తినడం అలవాటై పోయింది. నాన్‌వెజ్ ఐటమ్స్, ఐస్‌క్రీమ్స్, చాక్లెట్స్ తినెయ్యడంవలన చాలా లావు అయిపోయాను. వీడే, వసంతం సినిమాల్లో అందుకే లావుగా కనిపించాను. ఇష్టాన్ని చంపుకుని డైటింగ్ చేసి మళ్లీ సన్నబడతాను' అంటోంది ఆర్తీ అగర్వాల్.

మెల్లగా పక్కనే చేరాను. నాది అన్న ధైర్యం అసలు రావడంలేదు. ఏదో దొంగతనం చేస్తున్న ఫీలింగ్. మెల్లగా ఆమె మెడ మీద చేతులు వేసి, నున్నని చెక్కిళ్లతో నా ముఖం ఆనించాను. లేచి, తనూ అదే ఆలోచనతో ఉన్నట్లు కొద్దిగా సిగ్గుగా నాలో ఇమిడిపోతోంది.

నేను స్వప్నను పొదివి పట్టుకుని ఆమె పెదాల్ని అందుకోబోతున్నాను.

"అమ్మా!" అంటూ సడెన్‌గా చిన్నీ లేచింది. దానికి వాళ్ళమ్మను వదిలి పెట్టి ఉండడం అలవాటు లేక నిద్దట్లో హఠాత్తుగా గుర్తొచ్చినట్లుంది.

ఏడుపు మొదలుపెట్టింది. దాన్ని బుజ్జగించి నిద్రపుచ్చేవరకూ అర్ధరాత్రి దాటింది.

ఈలోగా నా మూడ్ గాల్లో కలిసిపోయింది.

ఆదివారం ఉదయం స్వప్న తలస్నానం చేసి చిన్నీని కూడా తయారుచేసి గుడి ప్రోగ్రాం పెట్టింది. అది సంతోషిమాత గుడి. ఎంతో పవిత్రంగా, అద్భుతంగా ఉంది. హైదరాబాద్‌లో పుట్టి పెరిగినా నేనింతవరకూ ఈ గుడిని చూడనేలేదు. అదే ఆవరణలో గణపతి, నవగ్రహాలు, ఆంజనేయుడు ఇవన్నీ గుళ్ళు అందంగా, శుభ్రంగా ధూప దీప నైవేద్యాలతో వెలిగిపోతున్నాయి.

అందరూ ఎంతో ఆప్యాయంగా స్వప్నతో మాట్లాడుతున్నారు. తను ఎన్నో ఏళ్ళుగా ఆ గుడికి వెళ్తున్నానని, పూజారులందర్నీ నాకు పరిచయం చేసింది. పూజలయ్యాయి. పన్నెండుగంటలకి ఇల్లు చేరాం.

ఉదయాన్నే చేసి పెట్టినట్లుంది. ఒక్కసారి వేడి చేసి అన్నం వడ్డించింది. సాయంత్రం బస్సుకే నా ప్రయాణం. ఎండలో తిరిగి రావడం వల్లనేమో అన్నం తినగానే చిన్నీ గాఢనిద్రలోకి జారిపోయింది. నా ఎదురుగా కూర్చున్న స్వప్న గంధం రంగుచీరలో, గాలికి ఎగురుతున్న కురులు, కుంకుమబొట్టుతో ఎంతో అందంగా ఉంది.

చిన్నగా "రామూ" అంది.

"ఏంటి?" అన్నట్లు చూస్తే "మీకు నేను ఒక విషయం చెప్పాలని అనుకుంటున్నాను" అంది.

నేను పక్కగా కూర్చుని తన చేతిని నా చేతిలోకి తీసుకున్నాను.

"మీ పరిస్థితి, నా పరిస్థితి ఒక్కటే. కాకపోతే చిన్న తేడా. మీ ఆలోచన వేరు. అదే తొందర ఎందుకు? 26 ఏళ్ళు ఎంత హుందాగా కంట్రోల్‌గా ఉన్నారు. నాకు తెలుసు. మీ ఇంజనీరింగ్‌లో ఎంతమంది అందమైన అమ్మాయిలు మీ స్నేహం కోసం పడిగాపులు కాచారో. అయినా గోల్డ్‌మెడల్, యూనివర్శిటీ ర్యాంక్ లక్ష్యంగా పెట్టుకుని ఎవర్నీ దగ్గరకు రానివ్వలేదు. మళ్లీ ఏసెంచూర్‌లో చేరాక ఎంతమంది మీకు సంబంధాలు చూశారో. ఎంత మంది అమ్మాయిలు మీ భాగస్వామిని కావాలనుకున్నారో. అయినా మీరు చలించలేదు. పెళ్ళి అయిన తర్వాత మీలో ఏదో అసంతృప్తి కనబడుతోంది. కారణం నాకు తెలుసు. అయినా పెద్దలు నిర్ణయించిన ముహూర్తం రోజునే ఎందుకు అని మీలో చిన్న అసంతృప్తి. మీ పెళ్ళాం మీ ఇష్టం అనే భావన. అసలు ఈ ముహూర్తాలు అవీ ఎందుకు? అని మీ మనస్సుని కలత పరచే మోడ్రన్ స్నేహితుల ఉవాచలు, ఛాదస్తాలు, సెంటిమెంట్స్ అంటూ మన ఆచారాలను, ఆనవాయితీలను, అలవాట్లపై చిన్నచూపు.. ఒక బంధం గట్టిపడి అది వంశాభివృద్ధికి తోడ్పడి మంచి తెలివైన, అందమైన, ఆరోగ్యవంతమైన పిల్లల్ని అందించాలంటే దానికి దైవానుగ్రహంతో పాటు ఎన్నో పరిస్థితులు అనుకూలించాలి. ధర్మశాస్త్రాలు దంపతులిరువురి దోషాలు సరిసమానమన్నాయి. పురుషుడు ఉద్భవించినది స్త్రీ ద్వారానే. మరి ఆమె పట్ల కృతఘ్నుడై ఉంటాడేం? పురుషులు తమ పాపాల్ని పట్టించుకోరు. స్త్రీలు గుర్తించి గొప్పవారవుతారు. ఆత్మమనసులో, మనసు ఇంద్రియంలో, ఇంద్రియం వస్తువులో త్వరితగతిన లీనమవుతుంటాయి.

ఇంతటి బంధముండగా మనసుకు ప్రాప్తం కానిది ఏముంది? మనసెటు వెళ్ళితే ఆత్మ అటే వెళుతుంది. అందుకే ఈ నలభైరోజులు అంటే ఆ శుభకార్యం జరిగేది మాఘమాసంలో అంటే ఫిబ్రవరి నెల. అప్పటివరకూ మీరు నలభైరోజులు ఆంజనేయునికి, నేను 40 రోజులు అమ్మవారు సంతోషిమాతకు మండలం పూజ చేయాలి. తర్వాత మనకు తొలిసారిగా అమ్మాయి పుడితే ఆమె అమ్మవారి అంశతో శోభిల్లుతుంది. అదే అబ్బాయి అయితే ఆంజనేయుని లాంటి బలశాలి, బుద్ధిశాలి, ధైర్యస్థుడు, గుణశీలుడు అవుతాడు. అంగీకరిస్తారు కదూ!" అంటూన్న ఆమె అద్భుతమైన సలహాని మంత్రముగ్ధుడిలా వింటున్నాను. సాయంత్రం ప్రయాణంలో ఏ విధమైన అలజడి, ఆవేశం ఏదీ లేదు. ఆమె అన్నదాంట్లో ఏదీ అసత్యం లేదు. అనుకుంటే సాధించలేనిదీ ఏదీలేదు.

నలభైరోజుల తర్వాత అత్యంత ఆర్భాటంగా జరపబోయిన ఆ కార్యక్రమం స్వప్న సలహా ప్రకారం సింపుల్‌గా జరిగింది. కానీ అసలు కథ మా సొంత ఫ్లాట్‌లో బెంగుళూర్‌లో జరిగింది. ముచ్చటగా ఆ మూడురోజుల తర్వాతనుండి.

★